కథ

# బొగ్గు

డా. సదానంద్ శారద

నువ్వేమో మందమర్రి బొగ్గు బాయిల పని సేస్తవు. నీ బిడ్డను మాత్రం పేటకిస్తివి. అల్లుడు...అయ్యో! నీ అల్లుడు అందరి అల్లుడసోంటోడె! ...మంచి అల్లుళ్లు దొరకాలంటె ఎంత పున్నెం సేసుకోవాల్నో! ....నువ్వు పాపం సేసుకున్నవని కాదు... ఇంకా శానా పున్నెం సేసుకోవాల్నో ఏమో..!



బొగ్గు బాయిల పనిసేసే నిన్ను అల్లుడు బొగ్గు కిందనే జమకట్టిండు... దబాయించడం మొదలు పెట్టిండు...దోసుకొని దోసుకొని నీ ఇల్లు గుల్ల 'సేసిండు... దొంగోనికి, అల్లునికి బేధం ఏడున్నది? లేదు... ఒకడు రాత్రి పూట... ఇంకోడు పగలే దోసుకుంటడు. ఇప్పుడైతే రాత్రి, పగలు అనేది కూడా లేదు. ఎప్పుడు పడితే అప్పుడు బాయిల సేదేసినట్లు దోసుకునుడే!!

గా దోపిడి సూడలేక నీ బిడ్డ ఇగ ఇంటికి రాన న్నది. పుట్టిల్లు గడప తొక్కను అన్నది. తొక్కించేది అల్లుడైనా కంటనీరు ఒలికేతి నీ బిడ్డకే కదా...

ఎవల బిడ్డైనా వాళ్లకు మంచిది. నీ బిడ్డ శానా మంచిది. నీ గోస సూడలేక గుండెరాయి 'సేసుకొని నేను రానే నాయినా అన్నది. రానే అవ్వ అన్నది. కన్నపానం ఆగుతదా.. బిడ్డను సూడక నువ్వుంటవా..నీ పెళ్లాం వుంటదా... నిన్ను పోయి ఒకసారి సూసి రమ్మన్నది. నీ కండ్ల తోటి బిడ్డను సూసుకుంట అన్నది. పైగా బిడ్డ ఒట్టి మనిషి కాదాయె. ఈ వంకతోని అల్లుడు ఇంక దోసుకుంటడు. కాని బిడ్డ మీ పేగు కదా... అడ్డుపడతాంది. అయినా తండ్రి పానం కొట్టు కుంటది. తల్లి పానం కొట్టుకుంటది కదా...కొట్టు కోకపోతె తండ్రి ఎట్ల?...తల్లి ఎట్ల?...

బిడ్డను తోలుకొచ్చేదానికి బయలుదేరినవు. దోసుకొని దోసుకొని ఏం మిగలకపోయినా గా ఇల్లు ఉన్నది... గా ఆశతోటి వున్నడు అల్లుడు... ఎప్పుడు గా ఇల్లును మింగుదామా అని గుంట నక్క లెక్క ఎదురు సూస్తాండు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ బండి అంటే నీకు బంగారం. బిడ్డ వుండే పేటకు పోయే కాకైనా... పిట్టయినా నీకు భాగ్యంగానే కన్పడ్తయి. సుట్టా ల్లెక్కనే కనపడ్తయి.

భాగ్యనగర్ బండి ఎక్కితె కూసోడానికి గంత జెప్పున సీటు దొర్కుతాది! నిలబడి నిలబడి కాళ్లు సతికిలబడినా నీ పానం నొచ్చుకున్నదా... నొచ్చుకోలె- గది బిడ్డ సుట్టూ తిరుగుతున్నది గదా.....

కూసునోళ్లకు ఉబుసుపోక మాటలెక్కువ- ఒగాయిన ఇంకోగాయినెతోని అంటాండు...

''ఆ రాయిల ఏమున్నదని మొక్కుతరండీ?''

ఇంకోగాయినె రాయికి మొక్కేటాయినే కాని సర్రున మాటలకు మాట సెప్పేటోడు కాదు- గసోంటప్పుడు నవ్వు బాగ పని సేస్తది. నవ్వి ఊకున్నడు-నవ్వుకు పైసలు కర్సు కావు- మాటలు కర్సు కావు- గందుకని నవ్వి ఊకున్నడు.

నవ్వేటోళ్లంటె ఎదుటోళ్లకు పల్సన... ఇగ మాట మీద మాట ఇడ్సిపెడ్తాండు... గుల్లేరు రాయిలెక్క ఇసురు తాండుగా పెద్దాయినె-

''ఆ రాయిల ఏం మహిమ ఉన్నదని మొక్కు తారు మీరంతా. దాని మీదకెల్లి ఎలుక పిల్లలు తిరుగుతాయి. -బల్లులు పాకుతాయి. నానా గలీజ్ చేస్తాయి. ఆ రాయికి మహిమ వుంటె... అవి అట్లా గలీజ్ చేస్తయా?''

నువ్వు సిన్నప్పుడు మీ అమ్మ మీద గలీజ్ 'సేయలేదా... గప్పుడు అమ్మ ఏవన్నా అన్నదా? అని నువ్వు అనుకుంటావు-

గా ఇనేటాయినె 'చేయలే' అన్నట్లు తలూ పిండు. తలూపడానికి కర్సు లేదు. మనిషి జబర్ద స్తిగున్నడు. ఏ కర్సులు 'సేసేటట్టు లేదు. టికి టైనా కొన్నడా? మీ ఎమ్మెల్యే సాబ్ గీయినె లెక్కనే అసంబ్లీ సీట్ల కూసొని తలూపుతాండా! ఈడియన్నీ దోసుకపోతాంటె...!!

నీకు ఒళ్లు మండుతాయ్.....

నువ్వు తిర్పతి... వెంకటేసరసామిని తల్సు కొని దండం పెట్టుకున్నవు... యాదగిరి నర సిమ్మ సామిని తల్సుకొని దండం పెట్టుకున్నవు. దుర్గక్క తల్లిని తల్సుకొని తల్సుకొని దండం పెట్టుకున్నవు...

''ఆ రాళ్లకు మహిమ వుంటె... మీది సొమ్ములను దొంగలు దోచుకపోతుంటెనన్నా కొట్టాలె గదా?''

నీ రగుతం సలసల కాగబట్టింది.

ఇగ నోరు మూసుకొని గాయినె దబా యించుడు సయించలేక పోయినవ్...

''సారూ... నేనొక్కటి అడుగనా?''అన్నవు.

కూసున్న గా సారు నిల్సున్న నీ దిక్కు తిరి గిండు-

''ఏవిటో అడుగు'' అన్నడు.

''బొగ్గుల్నుంచి కరెంటు తీస్తరట కదా సారూ... మా రాంగుండంల పెద్ద మిల్లు ఉన్నది...''

''అవును...''

''బొగ్గుల్నుంచి వొచ్చిన కరెంటు షాకిస్తది గదా... బొగ్గు షాకిస్తదా సారూ?''

''ఇవ్వదు...''

''మరి గా బొగ్గుల కరెంటు లేదంటరా సారూ?''

సారుకు నోటమాట రాలె. ఆలోస్నెల పడి నట్లున్నడు..

''గా రాళ్లకు రప్పలకు దండాలు ఎందుకు పెడ్తున్నరు అని అడుగుతున్నరు. మరి మా గోస సెప్పుకునేది ఎవలకు సారూ...గా వాటికే కదా.. గవే ఇంటయి గదా...సిన్నప్పుడు మా అవ్వోలె... అయ్యోలె!! ఎమ్మెల్లే సాబులు ఇంటరా? ఆపీసర్లు ఇంటరా? అసలు దగ్గరికి రానిస్తరా....మనకు తెలిసిందే గ్యానం అనుకోవద్దు సారూ..తెల్వ నియి శానా ఉన్నయి...గిట్ల అంటున్నని ఏవను కోకుండ్రి సారూ...మీ అంత సదువుకున్నోన్ని కాను.. కోపం తెచ్చుకోకుండ్రి...'' అన్నవు... వినయం నీ అక్క మర్యాద నీ సెల్లె గదా...



''ఆ రాయిల ఏం మహిమ ఉన్నదని మొక్కుతారు మీరంతా. దాని మీదకెల్లి ఎలుక పిల్లలు తిరుగుతాయి. -బల్లులు పాకుతాయి. నానా గలీజ్ చేస్తాయి. ఆ రాయికి మహిమ వుంటె... అవి అట్లా గలీజ్ చేస్తయా?'' నువ్వు సిన్నప్పుడు మీ అమ్మ మీద గలీజ్ 'సేయలేదా... గప్పుడు అమ్మ ఏవన్నా అన్నదా? అని నువ్వు అనుకుంటావు.

సారు ఏమనుకున్నడో గాని నిన్ను సూసి నవ్విండు- కూసున్నోళ్లంతా గట్లనే నవ్విండ్రు- నవ్వు మొహం పెట్టిండ్రు.. నిల్సున్నోళ్లంతా నీతోని ఉన్నోళ్లు గదా.. నిలువెత్తు సంబరంతో నిన్ను సూసిండ్రు....

సారూ ఇగ మాట్లాడలె... మంచిగ మంచి మర్యాదల దిగిపోయిండు- గా సీట్ల నిన్ను కూసొమ్మని పిలిసిండ్రు. ఆడ కూసున్నోళ్లు.... ఆమెను కూసోనియిండ్రి అని ఒగ పసిపిల్ల తల్లిని కూసోబెట్టినవు.

ఏడ్నించి వస్తానవు పెద్దయ్యా- ఏడికి పోతానవు పెద్దయ్యా... ఒకటే అడుగుడు... మాకు ఏమనాల్నో తెలువలె- గా సారును భలే అడిగినవు... అని కొందరు నిజాయితీగ మాట్లాడిండ్రు- కొందరేమో మేమే గా మాట అందామనుకున్నం... నువ్వన్నవు.. అని బడాయిలకు పోయిండ్రు.. ఒగరు పొగడాల్లని నువ్వేం అన్లే... నీ మన్సుల మాట సెప్పినవు... నీ నమ్మకం నీది... తెగిడితె కుంగిపోవు.. పొగిడితే పొంగిపోవు... గట్లనే ఉండాలె-మన్సుల ఉన్న మాట గట్టిగ సెప్పాలె... గంగిరెద్దుకు అన్నవు కావద్దు...

ఆ సంటిపిల్ల తల్లిని సూస్తాంటే నీకు రేపటి నీ బిడ్డ రూపం కండ్లల్ల పటం గడ్తాంది. గిట్లనే బిడ్డ సంటిదాన్ని సంకల ఏసుకొని రైలు ఎక్కాలె. దిగాలె... బిడ్డ కట్టం తల్సుకొని నీకు కడుపుల దేవినట్లయింది.

మన్సుల్ని... మాటల్ని... మూటల్ని మోస్తూ... రైలు తనదారిన తాను పరుగు పెడ్తాంది...

నువ్వు బిడ్డ ఉన్న పేటకు చేరుకున్నవు... నీ కంటే ముందే నీ మనసు చేరుకునె! నీ పానం చేరుకునె..బిడ్డను తడుముకునె...

నీ కాయం నీ బిడ్డ వున్న ఇంటి గడపల్ల కాలు పెట్టబోయి కొయ్యబారిపోయింది.

ఇంట్ల నుంచి నీ అల్లుని మాటలు ఎన్ కౌంటరు తూటాల్లెక్క రాబట్టినయి...

''కూర తెచ్చి వొండమంటె..పప్పు నీళ్లతోటి కూడు బెడ్తవా.....?''

''పానం బాగలేదయ్యా?'' నీ బిడ్డ దీనంగా అన్నది.

''నీకు పానం ఎప్పుడు బాగున్నదని...''

''అట్లా అంటవేంది? మంచిగున్నప్పుడు నీకు ఏది కావాల్నంటె అది చేసి పెట్టలేదా?''

''ఇప్పటి సంగతి మాట్లాడు రాస్కెల్....''

''పిండం జారుతున్నట్లు అయితాంది. దవాఖానకు పోదామయ్యా...''

నీ బిడ్డ పబ్బది ఇనపడ్తాంది. నీకు కాళ్లు సేతులు సల్లబడ్డయి.

''మాటి మాటికి దవాఖాన..దవాఖాన అంటె ఏడ్నుంచి వస్తయి పైసలు. నీ అయ్య ఏమన్న లక్షలు గుమ్మరించిండా? నిన్ను మాటి మాటికి దవాఖానకు తీసుకపోడానికి...''

''లక్షలు గుమ్మరించినోళ్లనే చేసుకోకపోయినవ్.... నన్నెందుకు చేసుకున్నవ్...''

''ఏందే..మాటకు మాట అంటున్నవ్....''

''అయ్యో... అయ్యో... కొట్టకయ్యా.. నీకు దండం పెడ్తా... బిడ్డకు తగుల్తదయ్యా..'' విలవిల్లాడిపోయింది బిడ్డ....!

ఇగ అక్కడ నిల్సోడం నీకు వశం కాలేదు- ఇంట్లకు ఉరికినవు...

బిడ్డ మీదికి లేపిన నీ అల్లుని చేయి అందుకున్నవు. షాక్ తిన్నడు. నీ అల్లుడు... నీ ఉగ్ర రూపం సూసి బెదిరిపోయిండు... నువ్వొక సదువురాని సవటవు... దద్దమ్మవు... బెదురుగొడ్డువు... బొగ్గువు అనుకున్నడు నీ అల్లుడు. ఇట్ల వొస్తవు చెయ్యి అందుకుంటవు అనుకోలె..

''ఇంకొక మాట నా బిడ్డనేమన్న అన్నవంటె నాలిక సీల్తది...'' పిడుగుల్లెక్క వొచ్చినయి ఆ మాటలు...

''నా బిడ్డ మీదికి సెయ్యి ఎత్తితే నిన్ను ఇరిసి పాతర పెడ్తా.... సంసారం అంటె పైసలేనా..'' అని నువ్వు ఉరిమి సూసేసరికి నీ అల్లుడు గజగజ వొనికిపోయిండు.. షాక్తోని నోట మాట రాక బీరిపోయిండు.....

''ముందుగాల దవఖానకు పోదాం రా బిడ్డా...'' అని బిడ్డను దవఖానాకు తీసుకుపోయినవు.. దేవుని లెక్క ఆదుకున్నవు...!

★

# త్రిష రూటే వేరు!!

ఒక్కొక్కరికి ఒక్కో సరదా ఉంటుంది. వాచీలు సేకరించడం స్నేహకి సరదా అయితే చెప్పులు సేకరించడం త్రిషకి సరదా. ఎక్కడికి త్రిష వెళ్ళినా అక్కడ లభించే రకరకాల చెప్పులు సేకరించడం త్రిషకి బాగా అలవాటయిపోయింది. ఆ సంగతి అలా ఉంచితే మరో విషయం ఏమిటంటే లాప్‌టాప్ లేకపోతే క్షణం కూడా ఉండలేదట త్రిష. షూటింగ్‌లో ఖాళీ దొరికితే చాలు! లాప్‌టాప్ ముందే త్రిష కూర్చుంటుందిట. ఫ్రెండ్స్‌తో చాట్ చేస్తూ హాయి హాయిగా గడిపేస్తుందట. టైం దొరికితే ఒకరి చెవులు ఒకరు కొరుక్కునే ఈ రోజుల్లో త్రిష వాటికి దూరంగా ఉండడం బాగానే ఉంది. త్రిషకి శ్రియ మంచి ఫ్రెండట! ఆ చాటింగ్ అంతా ఆమెతోనేనేమో!? ఏదేమయినా ఇది మంచి అలవాటే!

